క్లుప్తంగా

కనుల పండువగా ఏకవీరమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జిల్లేమడక వడ్డిపల్లి గ్రామంలో గురువారం గ్రామదేవత ఏకవీరమ్మ తిరునాలను కనుల పండువగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున ఆలయం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం పొంగుబాలు కార్యక్రమం నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా మంచాలమ్మ జాతర



మంచాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

రామాపురం : కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం మంచాలమ్మ అని భక్తుల విశ్వాసం. మండలంలోని రాచపల్లి గ్రామం గంగనేరు సమీపంలో వెలసిన మంచాలమ్మ తిరునాల మహోత్సవంలో భాగంగా గురువారం రాత్రి అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. జాతర ముగింపు సందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. రెండో రోజు అమ్మవారిని పలు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించి తిరిగి దేవస్థానానికి తీసుకువచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టపక్కల జిల్లాల నుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజల కోరిన కోర్కెలు బదులుగా అమ్మవారికి చాందిని బండ్లు, బాణసంచా, చెక్కభజనలు కోలాటాలు తదితర కార్యక్రమాలలో నిర్వహిస్తారు.

భక్తులతో పోటెత్తిన పల్లమ్మ జాతర




జాతరలో పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు

పెనగలూరు : మండలంలోని ఎన్ఆర్ పురం పంచాయతీలోని పల్లంపాడు గ్రామం చెయ్యేరు నది ఒడ్డున వెలసిన పల్లమ్మతల్లి జాతర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు పొంగళ్లు పొంగించి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ఆటోలు, పందేరపు బండ్లు పెద్దఎత్తున ఈ ఏడాది పాల్గొన్నాయి. పక్కనే చెయ్యేరు నది ఉండటంతో భక్తులకు నీటి సమస్య తలెత్తలేదు. సిద్దవరానికి చెందిన గంగయ్య వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భక్తులకు మినరల్ వాటర్ బాటిళ్లు అందజేశారు. ముందు జాగ్రత్త చర్యగా జాతర వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ హేమాద్రి తెలిపారు.

26న టెన్నిస్‌బాల్ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక

సిద్దవటం : వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి అండర్ 17 బాల, బాలికల టెన్నిస్ బాల్ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 26వ తేదీన 9.30 గంటలకు మైదుకూరు పట్టణంలోని మేధా డిఫెన్స్ అకాడమీలో జరుగుతున్నట్లు టెన్నిస్ బాల్ క్రికెట్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి బి.వి. సుబ్బయ్య తెలిపారు. సిద్దవటంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలకు ఎంపికకు వచ్చే వారు 1వ తేదీ జనవరి 2006 తరువాత పుట్టిన వారు అర్హులన్నారు.

సాంప్రదాయ ఆటల్లో చిన్నారులు



ఇసుకలో గుజ్జనగూళ్లు కడుతున్న చిన్నారులు

సంబేపల్లె : 5జీ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో స్మార్ట్ ఫోన్‌తో పిల్లలకు, పెద్దలకు రోజు ప్రారంభమైయ్యే ఈ కాలంలో సాంప్రదాయ ఆటలకు ఎప్పుడో కాలం చెల్లింది. స్మార్ట్ ఫోన్‌లలో ఆన్‌లైన్ గేమ్‌లు, వీడియో గేమ్‌లు తదితర అంతర్జాల సేవలు వినియోగించుకొంటూ భౌతికంగా ఆడే ఆటలను పిల్లలు ఎప్పుడో మరిచిపోయారు. ఈ క్రమంలో మండల పరిధిలోని దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పిల్లలు అందరూ ఒకచోట చేరి ఇసుకలో గుజ్జన గూళ్ళుకడుతూ, చుకుచుకుపుల్లా, నాలుగురాళ్ల ఆట తదితర ఆటలతో పిల్లలు ఆడుతుండటం కనిపించింది. పిల్లలు ఆడుతున్న ఈ ఆటలకు తిరిగి పూర్వవైభవం తెచ్చేలా పిల్లల్లో అవగాహన కల్పించాలని గ్రామస్తులు చర్చించుకొంటున్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడుదాం



రాయచోటి అర్బన్: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..



లక్కిరెడ్డిపల్లె: నివాళి అర్పిస్తున్న సీపీఐ నేత శ్రీనివాసులు తదితరులు

వర్ధంతి వేడుకల్లో విద్యార్థి సంఘాల నేతల పిలుపు

రాయచోటి అర్బన్ : దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలకు తెగించి పోరాటం చేసిన భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ నాయక్‌లు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలంటూ కోరారు. యువతలో చైతన్యాన్ని, పోరాటస్ఫూర్తిని నింపి స్వాతంత్య్ర పోరులో పాల్పంచుకునేలా చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు గొప్ప పోరాట యోధులన్నారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య నేత అశోక్, ఏఐవైఎఫ్ జిల్లానేత వెంకటేష్, పుల్లయ్య పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

అన్యాయం, అక్రమాలను ప్రశ్నించడం, వాటికి వ్యతిరేకంగా పోరాడటమే భగత్‌సింగ్ నుంచి నేటి యువత, విద్యార్థులు నేర్చుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సర్వేపల్లె నరసింహ పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని ఎస్‌వీ విద్యామందిర్‌లో భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన మాట్లాడుతూ 23 ఏళ్ళ వయస్సులోనే బ్రిటీషువారి దోపిడిని ఎదిరించి సామ్యవాదన సాధనే ధ్యేయంగా స్వాతంత్రోద్యమ పోరులో ఉరికంబం ఎక్కిన భగత్‌సింగ్ త్యాగం వెలకట్టలేనిదన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి, ఎస్ఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.

ఏఐఎస్‌పీ ఆధ్వర్యంలో..

దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల ఆశయాలను కొనసాగిద్దామని ఏఐఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ కాలేషా పిలుపునిచ్చారు. అమరవీరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని గురువారం పట్టణంలోని ఐసా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమ పోరులో నిరంతరం రగిలిన విప్లవ జ్వాల భగత్‌సింగ్ అన్నారు. భారతీయుల స్వేచ్ఛ, స్వాతంత్రాల కోసం కొనఊపిరి ఉన్నంత వరకు పోరాడిన యోధుడన్నారు.

ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో..

నేటి యువత అమరుడైన భగత్‌సింగ్ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శులు కోటేశ్వరరావు, జక్కల వెంకటేషులు కోరారు. గురువారం వారు దివ్యతేజ స్కూల్‌లో భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలోని యువత మరింతగా చైతన్యవంతులు కావలసి ఉందన్నారు. విద్యారంగంలోని సమస్యల పరిష్కారం కోసం భగత్‌సింగ్ తదితరులను స్ఫూర్తిగా తీసుకుని పోరుబాట పట్టాలన్నారు. పోరాడితేనే సమస్యలు పరిష్కరింపబడతాయని యువత గుర్తెరగాలన్నారు.

ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో..

స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన భగత్‌సింగ్ రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు అమరులని ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లె సాయికుమార్ అన్నారు. ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో కల్పన ఒకేషనల్ కళాశాలలో అమరవీరుల వర్ధంతి వేడుకలు నిర్వహించారు. బ్రిటీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దోపిడి, పీడనలేని సమాజం కోసం ఉరికంభం ఎక్కిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు అమరులైన నేటి 92 సంవత్సరాలవుతున్నా నేటికి వారికి ప్రజల గుండెల్లో స్థానం ఉందన్నారు. యువత పోరాటమే ఊపిరిగా విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలంటూ కోరారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : భారతదేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన సర్దార్ భగత్ సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకెళ్లాలని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిదిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. సర్దార్ భగత్ సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా స్థానిక విశ్వభారతి స్కూల్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ రఘునాథరాజు, శ్రీనివాసులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ వలసదారుల దోపిడీ పరిపాలనను పారదోలి భారతదేశానికి విముక్తి చేయడం కోసం జరిగిన జాతీయ ఉద్యమంలో అనేక మంది బలిదానాలు చేశారని, అందులో విప్లవ విద్యార్థి యువజనులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, జైళ్లలో లాఠీలను, తూటాలను, ఉరికంభాలను చిరునవ్వులతో ముద్దాడిన సర్దార్ భగత్ సింగ్ విప్లవ ధృవతార అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వీడాలి

జగనన్న కాలనీ సందర్శనలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి



జగనన్న కాలనీలో పర్యటిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలో నారాయణరాజుపేటలో జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వీడాలని మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం జగనన్న కాలనీని ఎంపీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో అస్తవ్యస్తంగా జరుగుతున్న పనులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కాలనీలలో ఇంటర్నల్ రోడ్స్ ఉండాలన్నారు. తాగునీటి, విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండేలా ఆయా శాఖలు సత్వరమే చేపట్టాలన్నారు. పక్కా ఇళ్ల నిర్మాణం నిబంధనలకు లోబడి ఉండేలా చూసుకోవాలన్నారు. అడ్డదిడ్డంగా నిర్మాణాలు చేపట్టరాదన్నారు. అలాగే మండలంలో జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు శరవేగంతో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీతో పాటు ఎంపీడీఓ సౌభాగ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు కలీం, మండల ఉపాధ్యక్షుడు తుమ్మల శ్రీధర్‌భావనగౌడ్, నడివీధి సుధాకర్, హిమగిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డిపల్లెలోని మారెమ్మ గుడిలో అమ్మవారికి పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హస్తవరం సుబ్బరామిరెడ్డి, ఆకేపాటి రమేష్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు చలపాటి నరసింహశెట్టి, డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

ఏపీఎండీసీ సీపీఓను కోరిన సర్పంచ్ మినుగు సుధాకర్, గుత్తి హరినాథ్‌రెడ్డి



సీపీఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ సుధాకర్, గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి

ఓబులవారిపల్లె : ఈనెల 21వ తేదీన ఏపీఎండీసీ పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మినుగు సుధాకర్‌ను ప్రొటోకాల్ ప్రకారం వేదికపైకి ఆహ్వానించకుండా అవమానించినందుకు గాను పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్ రెడ్డి, సర్పంచ్ మినుగు సుధాకర్ గురువారం సీపీఓ సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేట పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్‌ను వేదికపైకి పిలవకపోవడం, దళితుడు అనే చిన్నచూపు ప్రదర్శించడం చాలా బాధాకరమని, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏపీఎండీసీ ఎండీ వీజీ వెంకటరెడ్డికి రాతపూర్వకంగా విన్నవించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొలూరు నారాయణరెడ్డి, కొలూరు శ్రీనివాసులు రెడ్డి, పి.లక్ష్మినారాయణ, మాజీ ఎంపీటీసీ పోకూరు సుబ్రమణ్యం, మైనార్టీ నాయకులు షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న అధికారి ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఓటరు కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం తప్పనిసరిగా చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలం ప్రతి విషయంలోనూ వెనుకబడి ఉందన్నారు. బీఎల్‌ఓలు విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. జిల్లాలో సిద్దవటం మండలం ఓటరుకు ఆధార్‌కార్డు అనుసంధానం 84 శాతం మాత్రమే నమోదు చేశారన్నారు. అలాగే ఓటర్ల జాబితా నుంచి మృతి చెందిన వారి పేర్లను తొలగించాలన్నారు. రెండు, మూడు రోజుల్లో మండల వ్యాప్తంగా ఓటరుతో ఆధార్ సీడింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. అవసరమైతే మండల అధికార బృందం స్పెషల్ డ్రైవ్‌ను ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శంకర్‌రావు, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, వీఆర్‌ఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయాల మహిళా పోలీసులు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటిన ఏఐటీఎస్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అభిషేక్‌రెడ్డి

రాజంపేట : తిరుపతి జిల్లాలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్టీయూఏ- 11 క్రీడాపోటీలలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో ద్వితీయ బహుమతిని ఏఐటీఎస్ విద్యార్థులు సాధించారు. వీరిని గురువారం అభినందనలు తెలిపిన అనంతరం ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పాఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణలు మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని వాగ్దేవి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఇన్‌సెటివ్-2కె23లో క్రికెట్ పోటీలో పాల్గొని ప్రథమ బహుమతిని సాధించారన్నారు. కబడ్డీ మెన్, ఉమెన్ పోటీలో ద్వితీయబహుమతిని, వాలీబాల్‌లో ద్వితీయ బహుమతిని విద్యార్థులు సాధించారన్నారు. విద్యార్థులు క్రీడాపరంగా రాణించేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీడీ నాగముని, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయాలి

రామాపురం : గ్రామ, వార్డు సచివాలయం సిబ్బంది అంకితభావంతో పని చేసి అటు ప్రజలకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకునిరావాలని మండల అభివృద్ధి అధికారి హైదర్‌వలీ అన్నారు. గురువారం మండలంలోని కుమ్మరపల్లె, బండపల్లి, చిట్లూరు గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించారు. మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు ఎప్పటికప్పుడు చేరేవేసేలా గ్రామ సచివాలయం సిబ్బంది తోడ్పడాలని, ప్రతి రోజూ బయోమెట్రిక్ ద్వారా విధులకు ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. సచివాలయం సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీనాథ్‌రెడ్డి మరణం తీరనిలోటు

ఏపీయూడబ్ల్యూజే నేత మలిశెట్టి సుబ్బరాయుడు

రాజంపేట : ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ శ్రీనాథ్ రెడ్డి మృతి జర్నలిస్ట్ లోకానికి తీరని లోటని ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నేత మలిశెట్టి సుబ్బరాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఆంధ్రప్రభలో 28 సంవత్సరాలు శ్రీనాథ్‌రెడ్డితో కలిసి పనిచేశామన్నారు. 1998 నుంచి 2005 వరకు మూడు పర్యాయాలు అధ్యక్షుడిగా శ్రీనాథ్‌రెడ్డి, తాను ప్రధానకార్యదర్శిగా కలిసి పనిచేశామని గుర్తుచేసుకున్నారన్నారు. ఎందరికో జర్నలిజంను నేర్పించిన మహోన్నత వ్యక్తి శ్రీనాథరెడ్డి అన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో జర్నలిస్టులకు పెద్దదిక్కును కోల్పోవడం బాధాకరమన్నారు.

టక్కోలి ఆర్బీకే ఆకస్మిక తనిఖీ

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని గురువారం బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎం.నాగరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతు భరోసా కేంద్రంలోని ఎరువులను, రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం ఆయన దేగనవాండ్లపల్లె, లింగంపల్లె, కడపాయపల్లె గ్రామాల్లో రైతులు సాగుచేసిన నువ్వులు, ప్రొద్దుతిరుగుడు, కొర్ర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరాన్ని జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిదన్నారు. కావున రైతులు ఈ సంవత్సరం కొర్రలు, రాగి, సజ్జ లు వంటి చిరుధాన్యాల పంటలను ఎక్కువగా పండించాలని రైతులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. రమేష్‌రెడ్డి, రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జి వంశీ, రైతులు పాల్గొన్నారు.

అడవులే ప్రాణాధారం

రాయచోటి టౌన్ : మనుషులకే కాదు జీవకోటి ప్రాణులకు అడవులే ప్రాణాధారమని పీఆర్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. గురువారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్సీజీ క్లస్టర్ కో- ఆర్డినేటర్ తౌఫిక్ అలీ, పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు నాగరాజు, పవన్‌ల ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు సర్వకోటి ప్రాణులకు ప్రాణాధారమని చెప్పారు. అడవులను మనం కాపాడితే ఆ అడవులే మనకు ప్రాణవాయువును ఇస్తాయని చెప్పారు. అందుకే అడవులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ప్రతి ఒక వ్యక్తి ఇల్లు, పరిసరాలు, పాఠశాలలు వంటి ప్రదేశాలలో పచ్చని మొక్కలు నాటి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిట్వేలి : ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థుల ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఎంఈఓ మహేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆదేశానుసారం ఆర్‌టీఈ, ఏసీటీ(21) ప్రకారం ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థులకు 25శాతం సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ వారికి ఉచితంగా చదివేందుకు అవకాశం కల్పించిందన్నారు. మండలంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆదాయ రహిత తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించడానికి ఈనెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు తమ పిల్లల పేర్లను సీఎస్ఈ లాగిన్‌లో విద్యార్థుల పేర్లను రిజిస్టర్ చేసుకోవాల్సిందిగా సూచించారు. అనాథలకు, హెచ్ఐవీ బాధితులకు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు- 10 శాతం, ఎస్టీ- 4 శాతం, బీసీ, ఓసీ ఆదాయం లేని వర్గాలకు 6 శాతంగా ప్రభుత్వం కేటాయించిదన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

శుభాల వసంతం రంజాన్ మాసం

రాయచోటి : రంజాన్‌మాసం శుభాల వసంతమని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రంజాన్ మాసం ఒక విశిష్టమైన కలిగిన మాసమని తెలిపారు. ఈ పేరు వినగానే మనస్సు భక్తితో, ఆనందంతో పులకరిస్తుందని చెప్పారు. ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించిందని, రోజా(ఉపవాసం) ఆరాధనను దైవం ఈ మాసంలోనే నిర్ణయించినందున ఈ మాసానికి పవిత్రత, గొప్పదనం వచ్చాయన్నాని వారు తెలియజేశారు. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో కఠోర ఉపవాసాలు చేయడం మహా పుణ్యకార్యమన్నారు. ఉపవాస దీక్షలకు, ప్రత్యేక ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్, మునిసిపాలిటీ శాఖలు ప్రత్యేక చొరవ చూపాలని అధికారులకు ఎమ్మెల్యేలు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ మాస ప్రారంభపు శుభాకాంక్షలు తెలిపారు.

ఎండల పట్ల అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీకృష్ణ

చిట్వేలి : రానున్న రోజులలో ఉష్ణోగ్రతల తీవ్రత పెరగనున్నాయని, కావున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ మోహన్‌లు మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత భగ్గుమనడంతోపాటు వడగాల్పులు వీచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు లాంటివి ఎక్కువగా తీసుకోవాలన్నారు. చిన్న పిల్లలు, వయోవృద్ధులు అధిక జాగ్రత్తలు పాటించాలన్నారు. గుడుగు, సన్‌గ్లాస్ వంటివి ఉపయోగించుకోవాలని వారు తెలియజేశారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శేషంరాజు, ఏపీఓ చంద్రకళ, హౌసింగ్ ఏఈ సుధాకర్, మెడికల్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్, ఏపీఎం, ఏఎస్ఓ దామోదర్, సీఆర్‌పీ చంద్ర, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ మనోజ్ చంద్ర అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభం కావడంతో వడదెబ్బ సోకకుండా వృద్ధులు, చిన్నారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయాలలో, అంగన్‌వాడీ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన వారు ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ ప్రకాశం, ఎస్ఐ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభిషేక్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



విద్యార్థి ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్‌ను ప్రారంభిస్తున్న రాజంపేట సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్

రాజంపేట : చిన్నతనంలోనే సేవా చేయాలనే ఆలోచన రావడం గొప్ప విషయమని రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఇంటర్ చదువుతున్న కొత్తపల్లె అభిషేక్ దాచిన డబ్బుతో అమ్మవారి గుడి వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. గురువారం చలివేంద్రాన్ని సబ్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిషేక్ పుట్టినరోజుకు ఆర్భాటాలకు చేయకుండా తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బుతో పాదచారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అభిషేక్‌ను ఆదర్శంగా తీసుకోవాలని హితువు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ భోగరాజు, ఆలయ కమిటీ సభ్యులు మణి, జయరామయ్య, ఆధ్యాత్మికవేత్త గంగనపల్లె వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోషక ఆహారాలపై అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండలంలోని పీవీజీపల్లె పంచాయతీ యూవీ అగ్రహారంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం సర్పంచ్ కామాక్షమ్మ ఆధ్వర్యంలో పోషక ఆహార పదార్థుల విశిష్టత గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వై.నిర్మలాదేవి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహగన్ రెడ్డి అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టిక ఆహారం అందిస్తున్నారని, వాటిని గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కిశోర బాలికల రక్తహీనత గురించి, చిరుధాన్యాలు వాటి ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

లక్కిరెడ్డిపల్లె : విద్యార్థులు ఉత్తమ లక్ష్యాలను ఎంచుకొని పదిలో మంచి ఫలితాలు సాధించాలని మనీషా విద్యానికేతన్ కరస్పాండెంట్ కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మనీషా విద్యానికేతన్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

గాలివీడు : ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని రాయచోటి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మునగ శివభాస్కర్ పేర్కొన్నారు. గురువారం గాలివీడులోని స్థానిక గౌతమ్ పాఠశాలలో విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివభాస్కర్ మాట్లాడుతూ పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రణాళికబద్ధంగా పూర్తి సన్నద్ధం కావాలన్నారు.